ఎంపిటిసి అభ్యర్థులు కావలెను..!

ప్రజాశక్తి - పాలకోడేరు

స్థానిక సంస్థల ఎన్నికలు ఊపందుకున్నాయి. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 21వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పాలకోడేరు మండల పరిషత్ ఎన్నికలకు వింత పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారు. రాజకీయ పార్టీలు అభ్య ర్థుల కోసం అన్వేషిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతున్న వేళ అభ్యర్థులు దొరకకపోవడంతో రాజకీయ పార్టీలకు తలనొప్పి గా మారింది. పాలకోడేరు ఎంపిపి స్థానాన్ని బిసి మహిళకు కేటాయించారు. జెడ్పిటిసి స్థానం జనరల్‌కు కేటాయించారు. పాలకోడేరు మండలం లో 19 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. వీటిలో బిసి జనరల్-3, బిసి మహిళ-3, ఎస్సీ జనరల్-2, ఎస్సీ మహిళ-1, జనరల్-5, జనరల్ మహిళకు 5 స్థానాలు కేటాయించారు. 19 ఎంపిటిసి స్థానా లకుగాను జనరల్‌కు 10 ఉన్నాయి. బిసిలకు 6, ఎస్సీలకు 3 చొప్పున స్థానాలు కేటాయిం చారు. రిజర్వు స్థానాల్లో పోటీకి అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపక పోవడంతో ప్రధాన పార్టీల్లోనూ అన్వేషణ మొదలైం ది. కొన్ని జనరల్ స్థానాల్లో అభ్యర్థులు పోటీకి మొగ్గు చూపుతున్నా ఖర్చు విషయంలో కాస్త వెనకడుగు వేస్తున్నారు. అయితే కొన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చినప్పటికీ, ఎక్కువ స్థానాల్లో పోటీకి అభ్యర్థులు దొరకట్లేదు. దీనికితోడు ఒక్కో ఎంపిటిసి స్థానానికి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చయ్యే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఎంపిటిసి అభ్యర్థు లు ఖర్చుకు వెనుక డుగు వేస్తున్నారు. దీంతో ఎంపిటిసి అభ్యర్థులు దొరకడం లేదని ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియకు గడువు సమీపించడంతో రాజకీయ పార్టీల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

విజయవాడ మేయర్‌గా ఎబి వెంకటేశ్వరరావును గెలిపించండి

- మార్పునకు మేధావులు కదిలిరావాలి
- సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు, ప్రముఖుల పిలుపు

ప్రజాశక్తి- ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి

విజయవాడ నగరపాలక సంస్థ (విఎంసి) మేయర్ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన మాజీ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావును గెలిపించాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వివిధ ప్రజాసంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. నగర ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న తరుణంలో ఆయనను స్వతంత్ర మేయర్ అభ్యర్థిగా నిలబెట్టడం ఒక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ధన రాజకీయాలకు అడ్డుకట్ట వేసి ప్రజా అజెండాను గెలిపించాలని కోరారు. విజయవాడలోని శ్రీ రామా ఫంక్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయవాడ మేయర్ అభ్యర్థి ఎబి.వెంకటేశ్వరరావును పరిచయం చేస్తూ సోమవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ, ప్రజాస్వామ్యవాదులందరూ మేయర్‌గా మాజీ పోలీసు కమిషనర్ ఎబి.వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. గతంలో విజయవాడ పోలీసు కమిషనర్‌గా పనిచేసి విశేష సేవలందించి రాష్ట్రపతి ప్రశంసలు, ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన ఆయన ఈ పదవికి అత్యంత సమర్థుడైన అధికారి అని పేర్కొన్నారు. రైతు కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిగా వ్యవసాయ సమస్యలు, సాగునీటి ఇబ్బందులు, 22 'ఎ' భూ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, రైతుల సంక్షేమం కోసం గట్టిగా పోరాడగలరని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాడే నాయకుడి అవసరం నేడు ఎంతైనా ఉందన్నారు. నగరంలో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, రౌడీయిజం, గూండాయిజం, డ్రగ్స్, గంజాయి సంస్కృతిని అణచివేసి, విద్యా సంస్థలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పాలకులు నగర అభివృద్ధిని పణంగా పెట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నగర ప్రజలపై ఇంటి పన్ను, నీటి పన్ను, డ్రైయినేజీ ఛార్జీలు పెంచి విపరీతమైన భారాలు మోపారని వివరించారని, మౌలిక వసతుల కల్పన మాత్రం నత్తనడకన సాగుతోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ నేడు రాజకీయాల్లో నైతిక విలువలు లోపించాయన్నారు. ప్రజాసేవ వ్యాపారమయంగా మారడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన ప్రజాస్వామ్యాన్ని, ప్రజాసంక్షేమాన్ని కాపాడే నాయకత్వం కోసం వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థులు, మేధావులు బాధ్యతగా ముందుకు వచ్చి ఎబి.వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. మేయర్ అభ్యర్థి ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి రాజకీయాల దుస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్, కార్పొరేటర్ పదవుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, పార్టీల వసూళ్లే ప్రామాణికంగా మారి రాజకీయం పూర్తిగా వ్యాపారీకరణ చెందిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో సీట్ల పంపకాలు, డబ్బుల పంపిణీ లెక్కలపైనే పార్టీలు దృష్టి పెడుతూ నగర అభివృద్ధి, ప్రజా అవసరాలపై చర్చను పూర్తిగా పక్కనపెట్టేశారని ఆక్షేపించారు. నగర ప్రజలు ఒక అవకాశం ఇస్తే ప్రభుత్వంతో పోరాడి విజయవాడ అభివృద్ధి నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ అధ్యక్షులు వరప్రసాద్, సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్‌బాబు, జన చైతన్య వేదిక నాయకులు లక్ష్మణరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.



విజయవాడ మేయర్ అభ్యర్థి ఎబి వెంకటేశ్వరరావు ఆత్మీయ సమావేశానికి హాజరైన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు

అధికార లాంఛనాలతో బుచ్చిబాబు అంత్యక్రియలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మాజీ ఎంఎల్‌ఎ, మాజీ ఎంపీ అయితాబత్తుల జోగేశ్వర వెంకట బుచ్చిమహేశ్వరావు(బుచ్చిబాబు) అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో ఆయన స్వగ్రామమైన గోపవరంలో సోమవారం జరిగాయి. గోపవరంలోని ఆయన ఇంటి సమీపంలోనే ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. గౌరవ సూచికంగా ఆర్మ్ రిజర్వుడ్ పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. అంతకుముందు చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు బుచ్చిబాబు పార్థివదేహాన్ని గోపవరం నుంచి అల్లవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని గ్రామాల్లో అలంకరించిన ప్రత్యేక వాహనంపై అంతిమయాత్ర నిర్వహించారు. ఈ అంతిమయాత్రలో గ్రామస్తులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు. తమ అభిమాన నేతకు నివాళులర్పించి తుది వీడ్కోలు పలికారు. సుదీర్ఘ రాజకీయాల్లో కల్మషం లేని రాజకీయ నేతగా పేరు తెచ్చుకోవడంలోనే కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి బుచ్చిబాబు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంతాపాన్ని తెలియజేశారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd
బ్రాంచ్ ఆఫీస్: ప్లాట్ నెం. 427, 428 1వ అంతస్తు, అంబిక ప్లాజా, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్-522503. ఫోన్: 09645-234599, 7625079244,
Email: mangalagiri@canfinhomes.com, www.canfinhomes.com
CIN: L85110KA1987LC008699
స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం ప్రకటన
Google Coordinates : 16.571720, 80.566559
https://www.canfinhomes.com/searchauction.aspx
www.auctionbazaar.com
తేది : 19-10-2026
స్థలం : మంగళగిరి
అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించటమే లక్ష్యం

- ఎస్ఎంఇ ఫోరం చైర్మన్, బ్రాండ్ గురు ప్రహ్లాద్ కాకర్

ప్రజాశక్తి - ఎన్‌టిఆర్ జిల్లా ప్రతినిధి

మహిళల తయారు చేసిన ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురా వడానికి, వారు తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేందుకు జాతీయ సరస్ మేళా వంటివి దోహదం చేస్తాయని జాతీయ స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ (ఎస్ ఎంఇ) ఫోరం చైర్మన్, బ్రాండ్ గురు ప్రహ్లాద్ కాకర్ అన్నారు. జాతీయ సరస్ మేళా–2026లో భాగంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులకు ఒక బ్రాండ్ కల్పించుకోవడం చాలా అవసరమన్నారు. అందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. బ్రాండ్ అంటే వినియోగదారుల్లో ఒక నమ్మకం కల్పించ డమేనన్నారు. ఎన్ఎంఎంఎస్ ముంబై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అపర్ణ రావు మాట్లాడుతూ మన విజయం మన చేతుల్లోనే ఉందన్న నమ్మకంతో ముందుకు సాగాలని సూచించారు. మన అభివృద్ధిపై ఎప్పటికప్పుడు మనమే పోటీదారులుగా నిలవాలన్నారు. బ్రాండ్ బిల్డింగ్‌తో పాటు ఆ ఉత్పత్తుల కవర్ ప్యాకింగ్ కూడా చాలా ముఖ్యమని వివరించారు. అందుబాటులో ఉన్న వనరులతోనే ప్రొడక్టుపై నమ్మకం కలిగేలా ప్యాకింగ్ చేయడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకోవచ్చన్నారు. అనంతరం స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ అధికారులు... ఔత్సాహిక మహిళ వ్యాపారవేత్తలకు తమ వ్యాపారంలో ఉన్నతిని సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. వ్యాపార రంగంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను విని వాటికి అవసరమైన పరిష్కారాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఇ ఎపి డైరెక్టర్లు షీలా శ్రీనివాస్, భవ్య శర్మ, సెర్ప్ అడిషనల్ సిఇఒ. ఆర్ శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.



సదస్సులో ఎస్ఎంఇ ఫోరం చైర్మన్, బ్రాండ్ గురు ప్రహ్లాద్ కాకర్, ఎన్ఎంఎంఎస్ ముంబై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అపర్ణ రావు తదితరులు

చిన్న గొడవలతో విడాకులు ఇవ్వలేం

- తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్ : దాంపత్య జీవితంలో చిన్న గొడవలు, అభిప్రాయ భేదాలను క్రూరత్వంగా పరిగణించి విడాకులు మంజూరు చేయలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. గత తీర్పులు, కేసులోని వాస్తవాల ఆధారంగా క్రూరత్వాన్ని నిర్ధారించాల్సి ఉంటుందని పేర్కొంది. 2009లో వివాహం చేసుకున్న హైదరాబాద్ దంపతులకు ఆ తర్వాత ఏడాదిలో కుమార్తె జన్మించింది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు మొదలయ్యాయి. భార్య వేధింపులకు పాల్పడుతోందంటూ భర్త దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను కింది కోర్టు కొట్టివేసింది, దాంపత్య హక్కుల పునరుద్ధరణకు భార్య దాఖలు చేసిన పిటిషన్ ను అనుమతించింది. ఈ తీర్పులను సవాలు చేస్తూ భర్త దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ సుజనలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. భార్య మానసిక సమస్యతో బాధపడుతోందని, ఇల్లరికం రావాలని ఆమె, అత్తమామలు ఒత్తిడి చేశారని భర్త చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొంది. గృహహింస కేసు దాఖలు చేయడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని తెలిపింది. దంపతులు 14 ఏళ్లుగా విడిగా ఉంటున్నప్పటికీ, స్వల్ప కారణాలతో విడాకులు మంజూరు చేయలేమని తెలిపింది.

సమన్లు రద్దుకు హైకోర్టు నిరాకరణ

బ్యాంకు రుణాన్ని వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) కింద చెల్లించేందుకు దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జారీ చేసిన సమన్లను రద్దు చేయలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఫోర్జరీ, మోసం ఆరోపణలపై క్రిమినల్ దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంది. క్షత్రియ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఫోర్జరీ పత్రాలు సమర్పించి రూ.4.82 కోట్ల మేర బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై 2021లో నమోదైన సిబిఐ కేసు ఆధారంగా 2026 ఆగస్టులో ఈడీ జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ పరుచూరి కుమార్ అలియాస్ కనుగంటి సురేష్‌కుమార్, మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. రుణం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఓటిఎస్ దరఖాస్తు పెండింగ్‌లో ఉందని, అరెస్టు వంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. ఫోర్జరీ పత్రాలతో రుణం పొందడంతోపాటు, నిధులను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారని ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసినా పిటిషనర్లు హాజరుకాలేదన్నారు. వాదనలు విన్న జస్టిస్ శ్రీనివాసరావు, విచారణకు పిలిచి వాంగ్మూలాలు నమోదు చేయడంతోపాటు పత్రాలు కోరే అధికారం ఇడికి ఉందని పేర్కొన్నారు. ఇడి అధికార పరిధిని ప్రశ్నించేందుకు తగిన ఆధారాలు చూపలేదని స్పష్టం చేస్తూ సమన్ల రద్దుకు, బలవంతపు చర్యలు నిలిపి వేయడానికి నిరాకరించారు. పిటిషన్లను కొట్టివేశారు.

equitas
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం : నెం. 769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్నా సాలై, చెన్నై-600002
ఫోన్ : 044-42995000, 044-42995050
స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు
1			Rs.1027000 / Rs.102700 / Rs.10,000	26.11.2026 / 11.00 / 12.30	SEGNTUR0426316
www.bankeauctions.com
www.equitas.bank.in
తేది : 20.10.2026 ప్రదేశం : గుంటూరు
అధీకృత అధికారి, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని 15 గంటలు

- సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

ప్రజాశక్తి-కాకినాడ

సముద్రంలో వేటకు వెళ్లి బోటు ఇంజన్ మరమ్మతుకు గురవడంతో చిక్కుకుపోయిన ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. భోగీ అప్పలరాజు, సూర తాత, వెంకటేష్, రాంబాబు, మాసేను శనివారం సాయంత్రం వేటకు వెళ్లారు. బోటు సముద్రంలో 70 మైళ్లు వెళ్లిన తరువాత ఇంజను మొరాయించింది. దీంతో సుమారు 15 గంటల పాటు సముద్రంలో చిక్కుకుపోయారు. అలల తాకిడి, వర్షం, చలి, తాగునీరు లేకపోవడంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆదివారం వేట ముగించుకుని తిరిగి వస్తుండగా బోటు ఇంజన్ మొరాయించడంతో గాలికి, అలల ఉధృతికి బోటు కొట్టుకుపోకుండా బండరాళ్లతో లంగరు వేసుకున్నారు. చుట్టూ చీకటి అలుముకోవడంతో రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఆదివారం సాయంత్రానికి బోటు తిరిగి రాకపోవడంతో నీళ్లరేవు, గచ్చకాయలపొర సమీపంలోని సుమారు 70 బోట్ల మత్స్యకారులు వేట నిలిపివేసి, సోమవారం ఉదయం సముద్రంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సముద్రంలో నిలిచిపోయిన బోటును గుర్తించారు. బోటుకు తాత్కాలిక మరమ్మతులు చేసి, మరో బోటు సహాయంతో ఐదుగురినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

సత్యసాయి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్మిక కర్షక భవన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలల వేతనాలు ఇవ్వకుంటే కార్మికులు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. దసరా పండగ పూట కూడా పస్తుల తోనే గడపాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. గత సెప్టెంబర్ లో సమ్మె చేసినప్పుడు జిల్లా అధికారులు 20 రోజుల్లోనే బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వగా సమ్మె విరమించడం జరిగిందన్నారు. అయితే హామీ ఇచ్చి 40 రోజులు దాటుతున్న నేటికీ వేతనాలు ఇవ్వలేదన్నారు. దీంతో కార్మికులు సమ్మెబాట పట్టక తప్పలేదన్నారు. సమ్మె చేపట్టి మూడు రోజులవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.అప్పట్లో జిల్లా ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఈ ప్రాజెక్టు నిర్మించి ప్రభుత్వానికి అప్పగించగా, దీనిని నిర్వహించడానికి కూడా ప్రభుత్వానికి చేతకాలేదని మండిపడ్డారు . దాదాపు 1300 గ్రామాలకు తాగునీరు అందించే ఈ పథకంలో 572 మంది కార్మికులు పనిచేస్తున్నారని ఈ పథకం కొనసాగించాలంటే ప్రతినెల రూ. 3.5 కోట్లు అవసరమని ఈ మొత్తాన్ని కూడా ప్రభుత్వం భరించలేని పరిస్థితుల్లో ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుందన్నారు. అదే కార్పొరేటర్లు కు కోట్లాది రూపాయలు రాయితీలు ఇచ్చే ఈ ప్రభుత్వాలకు కార్మికుల కు వేతనాలు ఇవ్వాలంటే మాత్రం మనసొప్పడం లేదన్నారు. కార్మికులు వేతనాలు పొందాలంటే ప్రతి మూడు నెలలకు ఒకసారి సమ్మె చేయాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. అసలు ఈ స్కీమును కొనసాగించాలని అనుకుంటున్నారా? లేదా ప్రైవేటుకు అప్పగించాలని చూస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. కార్మికులు వేతనాలు పెంచమని లేదా గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ప్రజలకు అవసరమైన నీటి సమస్యపైఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని పథకం అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం తో పాటు ప్రభుత్వానికి ఉందని ఓబులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో దాడులు దౌర్జన్యాలు హింసకు దారితీస్తున్న పరిస్థితులను చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ దౌర్జన్యాలకు దాడులకు అంతులేకుండా పోతుందని అదే వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకరకంగా ఉండడం అధికారంలోకి వచ్చిన తర్వాత మరొక రకంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. గతంలో ఆ ప్రభుత్వం చేసిందని మీరు చేస్తే వారికి పట్టిన గతే మీకు పడుతుంది అని హెచ్చరించారు. రాష్ట్రంలో పలుచోట్ల హింసకు దాడులకు దారితీస్తున్న పరిస్థితులను ఎన్నికల సంఘం పోలీసులు అరికట్టాలని ప్రతిపక్షాలు స్వేచ్ఛగా నామినేషన్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రజలను నిర్భయంగా ఓటు వేసే విధంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్ జిల్లా కమిటీ సభ్యుడు అంజి ముత్యాలు పాల్గొన్నారు.

GRIHUM
గృహమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీస్: 6వ అంతస్తు, బి-వింగ్, గంగా ట్రూనో, లోహెగాం, పూణే, మహారాష్ట్ర 411014.
సర్ఫేసి చట్టం 2002లోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు
1	LAP021920000005043147 / HF0219H20100130		10/10/2026	LAP02192 00000005043147, HF0219H20100130
2	HF0003H19100103		10/10/2026	
ప్రదేశం : విజయవాడ, తేది : 20-10-2026
అధీకృత అధికారి, గృహమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

హౌతీల భీకర దాడి

- యెమెన్ లో 53 మంది సైనికులు మృతి

కైరో: యెమెన్‌లోని ప్రభుత్వ సైనిక శిబిరంపై హౌతీ తిరుగుబాటుదారులు దాడి చేశారు. ఈ దాడిలో 53 మంది సైనికులు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని అధికార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇటీవల కాలంలో హౌతీలు జరిపిన దాడుల్లో ఇదే అతి పెద్దదిగా పేర్కొంటున్నారు. దక్షిణ యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లోని అల్-అలం సైనిక శిబిరంపై మూడు క్షిపణులతో హౌతీలు సోమవారం భీకర దాడి చేశారు. ఈ ఘటనలో శిక్షణ పొందుతున్న 200 మంది సైనికులకు గాయాలయ్యాయని షబ్వా ప్రావిన్స్ ప్రభుత్వం పేర్కొంది. వీరంతా అంతర్గత భద్రత కోసం శిక్షణ పొందుతున్నారని తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని తెలిపింది. శిక్షణ పొందుతున్న సైనికులే లక్ష్యంగా చేసుకున్న ఈ దాడిని షబ్వా భద్రత, స్థిరత్వంపై జరిగిన అత్యంత కీలకమైన దాడిగా పేర్కొంది. తగిన రీతిలో బదులిస్తామని తెలిపింది.

హౌతీల దాడిని తిరుగుబాటుదారులకు చెందిన సబా న్యూస్ ఏజెన్సీ సైతం ధ్రువీకరించింది. పలువురు మృతిచెందారని, మరికొందరికి గాయాలైనట్లు పేర్కొంది. ఇరాన్- అమెరికా మధ్య ఘర్షణలు తీవ్ర రూపం దాల్చిన వేళ హౌతీల దాడులు ఇటీవల కాలంలో పెరిగాయి. యెమెన్‌లోని తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా అక్కడి ప్రభుత్వానికి సౌదీ మద్దతు ఇస్తోంది. దీంతో, సౌదీపై హౌతీలు దాడులు తీవ్రతరం చేశారు.



AXIS BANK LIMITED
రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
1		12.11.2025	17.10.2026
తేది : 20.10.2026, ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్